క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేటలోని హెచ్‌పీఎస్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బేగంపేట పోస్టాఫీసు, గీతాంజలి స్కూల్, బేగంపేట రైల్వేస్టేషన్, ఓల్డ్ కస్టమ్స్ బస్తీ, పీఎఫ్ క్వార్టర్స్, బ్రాహ్మణవాడీ, వరుణ్ టవర్స్ లేన్, మాతాజీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు రూపాయల్లో.. టమాటా 11, నల్ల వంకాయ 28, పొడుగు వంకాయ 35, బెండకాయ 47, పచ్చిమిర్చి 43, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 40, పందిరిబీర 45, క్యాబేజీ 11, క్యారెట్ 15, దొండ 28, గుండుబీన్స్ 35, గింజ చిక్కుడు 50, గోకరకాయ 35, కీర 25, దోసకాయ 25, బీట్‌రూట్ 18, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 35, చామగడ్డ 50, మొరంగడ్డ 26, కందగడ్డ 23, సొరకాయ 13, పొట్లకాయ 15, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ(ఒకటి) 4-6, ముల్లంగి(ఒకటి) 3-5గా ఉన్నాయి. కాగా ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు ఉంటాయి.

బీఆర్‌ఎస్‌ను ఓడించే సత్తా బీజేపీకే ఉంది: మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: ప్రస్తుత పరిస్థితుల్లో అవినీతి బీఆర్‌ఎస్ సర్కార్‌ను ఓడించే సత్తా ఒక్క బీజేపీకే ఉందని సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి స్పష్టం చేశారు. రాంగోపాల్‌పేట డివిజన్ కళాసీగూడకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బుధవారం బేగంపేటలోని ఆయన కార్యాలయంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మర్రి శశిధర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో దయానంద్‌రావు, నర్సింగరావు, సదానంద, వివేక్‌రావు, నరేష్‌కుమార్, సంజయ్ కుమార్, గోపాలకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం, జగదీష్, వేణు తదితరులు ఉన్నారు.

పక్షుల మృత్యువాత ఘటనలో.. మరోసారి వినాయక గ్రౌండ్ సందర్శన



బీజేపీలో చేరిన నాయకులతో మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: వినాయక గ్రౌండ్‌లో అరుదైన జాతులకు చెందిన పక్షులు మృత్యువాతపడిన ఘటనలో అటవీ సిబ్బంది బుధవారం మరోసారి గ్రౌండ్‌ను సందర్శించారు. మంగళవారం రాత్రి మృతి చెందిన పక్షులను అటాప్సీ నిమిత్తం జూపార్కుకు తరలించిన అధికారులు స్థానికుల నుంచి అందిన సమాచారం ఆధారంగా మరోసారి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ గ్రౌండ్ ఆవరణలో పురుగులు పట్టి శిథిలమవుతున్న రావి చెట్టు కొమ్మను సిబ్బంది సేకరించి తీసుకువెళ్లారు. పురుగుపట్టి శిథిలమవుతున్న చెట్లను కాపాడే క్రమంలో స్థానికులు కొందరు రసాయనాలను పిచికారీ చేసి ఉంటారని, ఈ క్రమంలోనే పక్షులు రావి చెట్టు పైకి చేరి మందుల ప్రభావానికి లోనై చనిపోయి ఉంటాయని అటవీ సిబ్బంది భావిస్తున్నారు. దీంతో చెట్ల కొమ్మలను, చెట్టుకు పట్టిన చీడను సేకరించి తీసుకువెళ్లారు.

పార్కు సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్తాం

అమీర్‌పేట: సనత్‌నగర్ కేఎల్‌ఎన్‌వై మున్సిపల్ పార్కులో నెలకొన్న సమస్యలను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ దృష్టికి తీసుకువెళ్తామని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షాబాద్ శ్రీనివాస్‌రావు అన్నారు. కొన్ని చోట్ల లైట్లు వెలగని కారణంగా బుధవారం ఉదయం 5 గంటల సమయంలో వాకింగ్‌కు వచ్చిన ఇద్దరు వయోవృద్ధులు అదుపు తప్పి కింద పడిపోయారని తెలిపారు. గ్రేటర్‌లోనే అత్యుత్తమ పార్కుగా తీర్చిదిద్దేందుకు మంత్రి తలసాని ప్రణాళికలు రూపొందిస్తున్న నేపథ్యంలో పార్కులో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడం ద్వారా వాటి పరిష్కారం లభిస్తోందన్నారు. దీంతో పాటు ఓపెన్ జిమ్‌లో మరికొన్ని వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేసే అంశాన్ని మంత్రికి వివరిస్తామని చెప్పారు. ఆయన వెంట అసోసియేషన్ సభ్యులు చారి, చంటిరాజు, సోను, షాబాద్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పక్షుల మృత్యువాత ఘటనలో.. వినాయక గ్రౌండ్ సందర్శన

సనత్‌నగర్: వినాయక గ్రౌండ్‌లో అరుదైన జాతులకు చెందిన పక్షులు మృత్యువాతపడిన ఘటనలో అటవీ సిబ్బంది బుధవారం మరోసారి గ్రౌండ్‌ను సందర్శించారు. మంగళవారం రాత్రి మృతి చెందిన పక్షులను అటాప్సీ నిమిత్తం జూపార్కుకు తరలించిన అధికారులు స్థానికుల నుంచి అందిన సమాచారం ఆధారంగా మరోసారి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ గ్రౌండ్ ఆవరణలో పురుగులు పట్టి శిథిలమవుతున్న రావి చెట్టు కొమ్మను సిబ్బంది సేకరించి తీసుకువెళ్లారు. పురుగుపట్టి శిథిలమవుతున్న చెట్లను కాపాడే క్రమంలో స్థానికులు కొందరు రసాయనాలను పిచికారీ చేసి ఉంటారని, ఈ క్రమంలోనే పక్షులు రావి చెట్టుపైకి చేరి మందుల ప్రభావానికిలోనై చనిపోయి ఉంటాయని అటవీ సిబ్బంది భావిస్తున్నారు. దీంతో చెట్ల కొమ్మలను, చెట్టుకు పట్టిన చీడను సేకరించి తీసుకువెళ్లారు.

హౌసింగ్‌బోర్డు భూములు అన్యాక్రాంతం!

భూముల పరిరక్షణలో అధికారులు విఫలం



కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి హఫీజ్‌పేటకు వెళ్లే దారిలో రోడ్డుకు రైల్వేట్రాక్‌కు మధ్యలో ఉన్న స్థలం ఇదే.. (ఫైల్‌ఫొటో)

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి ప్రాంతంలోని హౌసింగ్‌బోర్డుకు చెందిన విలువైన భూములపై కబ్జాదారులు కన్నేశారు. తెలంగాణ విభజన తరువాత హౌసింగ్‌బోర్డు విభజన జరుగకపోవడంతో అందులో పని చేస్తున్న అధికారులు నామమాత్రపు విధులకు మాత్రమే పరిమితమయ్యారు. దీంతో ఎక్కడికక్కడ విలువైన భూములను కబ్జా చేసేందుకు కబ్జాదారులు గుట్టుచప్పుడు కాకుండా కబ్జాకు తెరతీస్తున్నారు. ఇటీవల కాలంలోనే సుమారు ఎకరంన్నర భూమిని కబ్జాచేసేందుకు కొందరు తెరవెనుక జరిపిన కుట్రలను ఏకంగా స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వెలుగులోకి తీసుకురావడం విదితమే. సుమారు వంద కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ భూమిని కబ్జాదారులు సర్వేనంబర్ల మార్పు పేరుతో సులభంగా చేజిక్కించుకునేందుకు ప్రయత్నించడం గమనార్హం.

- కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీ నుంచి హఫీజ్‌పేట వైపు వెళ్లేదారిలో రైల్వేట్రాక్ పక్కనే ఉన్న ఎకరంన్నర ఖాళీ స్థలంలో హౌసింగ్‌బోర్డు అధికారులు గతంలో ఈ స్థలం తమదేనంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కొందరు కబ్జాదారులు సదరు భూమి కూకట్‌పల్లి మండలం పరిధిలోకి రాదని, శేరిలింగంపల్లి పరిధిలోకి వచ్చే హఫీజ్‌పేట గ్రామానికి చెందిన 78 సర్వే నంబర్ అంటూ అధికారికంగా సర్వే కూడా చేపించడం ఇక్కడి దుస్థితికి అద్దం పడుతోంది. ఏకంగా హౌసింగ్‌బోర్డు ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించడం, ప్రైవేటు వ్యక్తులకు చెందిన స్థలం అంటూ భూమిని కబ్జాలోకి తీసుకునేందుకు ఇనుప రేకులతో కూడిన షెడ్‌ను ఏర్పాటు చేసినప్పటికీ అధికారులు చూసీచూడనట్లుగా వదిలేయడంలో అధికారుల హస్తం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- కాముని చెరువు ప్రాంతంలోను హౌసింగ్‌బోర్డుకు చెందిన విలువైన భూములు కబ్జాలకు గురవుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడి చెరువును ఆనుకొని అనేక సర్వేనంబర్లలో హౌసింగ్‌బోర్డుకు చెందిన భూములును ఉన్నాయి. వాటన్నింటిపై అధికారుల నిఘా లేకపోవడంతో స్థానికులు విలువైన భూముల్లో పాగా వేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. ఎలాంటి పత్రాలు లేకుండా విలువైన హౌసింగ్ బోర్డు భూముల్లో పాగా వేస్తున్నవారి పట్ల అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు కూడా ఉండటం గమనార్హం.
- కూకట్‌పల్లి ప్రాంతంలోని హౌసింగ్‌బోర్డుకు చెందిన భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా అధికారులు మాత్రం పరిరక్షించడంలో విఫలం అవుతున్నారు. ఎక్కడ చూసినా కనీసం చదరపు గజం ధర లక్షల రూపాయలకు తక్కువ లేకపోవడంతో స్థానికంగా కొందరు హౌసింగ్‌బోర్డు భూములపై కన్నేసి కబ్జా చేసేందుకు తెరవెనుక కుట్రలు పన్నుతున్నారు. ఇప్పటికే అనేక చోట్ల హౌసింగ్‌బోర్డుకు చెందిన విలువైన భూములు కబ్జాకు గురికాగా మరి కొందరు సైతం ప్రార్థన స్థలాల ముసుగులో ఖాళీస్థలాలను కబ్జాచేసేందుకు యత్నిస్తుండటం ఇక్కడికి పరిస్థితికి అద్దం పడుతోంది.

ఉన్నతాధికారుల దృష్టికి..

హౌసింగ్‌బోర్డుకు చెందిన భూములు తమవేనంటూ కొందరు చాలా కాలంగా కోర్టుల్లో కేసులు వేశారు. ఇటీవల కాలంలో కబ్జాకు యత్నించారు. అట్టివారిపై కఠినంగా చర్యలు తీసుకుంటున్నాం. వెంటనే ఆక్రమణలు తొలగించి భూములను పరిరక్షణకు చర్యలు చేపట్టాం. ఉన్నతాధికారులకు నివేదికలు ఇచ్చాం. వారి ఆదేశానుసారంగా తదుపరి చర్యలు ఉంటాయి. –కిరణ్‌బాబు, హౌసింగ్‌బోర్డు వెస్ట్రన్ డివిజన్ ఈఈ





కబ్జాకు గురవుతున్న స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, అధికారులు, తదితరులు (ఫైల్‌ఫొటో)

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న మాధవరం కాంతారావు

మోతీనగర్: సనాతన హిందూ ధర్మం పరిరక్షణ కోసం ప్రతి ఒక్క హిందువు కృషి చేయాలని బీజేపీ కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు అన్నారు. బుధవారం అల్లాపూర్ డివిజన్ జనప్రియకాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ శివరామాంజనేయ త్రికూట ఆలయాన్ని కాంతారావు సందర్శించారు. ఆలయ నిర్మాణానికి లక్ష వెయ్యి నూట పదహారు రూపాయలను ఆలయ కమిటీ, కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ... నాడు భక్త రామదాసు భద్రాద్రి రామయ్య కోసం.. నేడు ఈ ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్క హిందువు భాగస్వాములు కావాలన్నారు. హిందూ దేవుళ్లపై, హిందూ సంప్రదాయాలపై అనుచిత వ్యాఖ్యలు చేసే వారికి తగిన రీతిలో శిక్షలు పడేలా ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేలా యావత్ హిందూ సమాజం ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతినగర్ పార్కు సమస్యలు పరిష్కరిస్తాం



పార్కును పరిశీలించిన కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలోని పార్కును కాలనీవాసుల కోరిక మేరకు బుధవారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పరిశీలించారు. పార్కులో ట్రాక్ కొంత మేర దెబ్బతిందని వాకర్స్ ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పార్కు స్థలాలను పరిరక్షిస్తున్నారని.. వాటి అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే శాంతినగర్ కాలనీని అన్ని విధాల అభివృద్ధి చేశామని తెలిపారు. త్వరలో పార్కులో సమస్యలను కూడా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శంకర్ లింగం, కామేశ్వరరావు, మాధవ్‌రెడ్డి,శ్రీనివాస్, ఏఈ శివప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రవీంద్రభారతి స్కూల్ వార్షికోత్సవం

వేడుకల్లో విద్యార్థుల నృత్య ప్రదర్శన



కూకట్‌పల్లి: హైదర్‌నగర్‌లోని రవీంద్రభారతి విద్యాసంస్థల వార్షికోత్సవం శిల్ప కళావేదికలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర జీవవైవిధ్య శాఖ సంచాలకులు ఎస్. కాళీచరణ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి అమూల్యమైన సందేశాన్ని విద్యార్థులకు అందించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా అమ్మ గొప్పదనం, రైతు–సైనికుల ప్రాముఖ్యత, అమ్మవారి విశిష్టతలను తెలియజేసే పలు వైవిధ్యమైన దృశ్య రూపకములను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌ఐ బాబురావు, ఏజెడ్‌ఐ కిశోర్, డీన్ శ్రీలత, ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని, డీఈ హఫీజ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బిల్లు అప్‌డేట్ కాక కరెంట్ కట్



రిజిస్ట్రేషన్ కార్యాలయంలో విద్యుత్ ఆగిపోవటంతో అంధకారంలో వినియోగదారులు

మూసాపేట: విద్యుత్ బిల్లు బకాయిలను సకాలంలో చెల్లించలేదంటూ మూసాపేట రిజిస్ట్రేషన్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ సరఫరా ఆగిపోయింది. అయితే మూసాపేట రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ప్రీపెయిడ్ కరెంటు మీటర్ ఉంది. బిల్లు అప్‌డేట్ కాకపోవటంతో ఆటోమేటిక్‌గా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మంగళవారం సాయంత్రం నిలిచిపోవటంతో బ్యాటరీ ద్వారా కార్యాలయ వ్యవహారాలు నడిపించారు. బుధవారం ఉదయం కూడా కరెంటు రాకపోవటంతో వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించి బిల్లు అప్‌డేట్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో మధ్యాహ్నం ఒంటి గంటకు విద్యుత్ సరఫరా అయ్యింది. ఉదయం వచ్చిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఒలంపియాడ్ పరీక్షల్లో సత్తా చాటిన శ్రీచైతన్య విద్యార్థులు

కూకట్‌పల్లి : ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ పరీక్షల్లో సర్దార్ పటేల్ నగర్‌లోని శ్రీచైతన్య బాలికల రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన 83మంది విద్యార్థినులు 2వ దశకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి, ఏజీఎం శివరామ కృష్ణ, ఆర్ఐ పద్మజ, కోఆర్డినేటర్ మురళీ కృష్ణ, పాఠశాల డీన్ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



సకాలంలో చిన్నారులకు టీకాలు వేయించండి



టీకాల ప్రారంభంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: నిర్దేశిత సమయం ప్రకారం చిన్నారులకు టీకాలు వేయించి వారి ఆరోగ్య జీవితానికి తల్లిదండ్రులు పునాదులు వేయాలని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. తొమ్మిది నెలల చిన్నారులకు అందించే జేఈ (జపనీస్ ఎంసెఫ్‌హలైటిస్) టీకా ఫస్ట్ డోసుతో పాటు ఎఫ్ఐపీవీ (ఫ్రాక్షన్ ఇన్ యాక్టివేటెడ్ పోలియో వ్యాక్సిన్) మూడో డోస్ వ్యాక్సినేషన్‌ను బుధవారం ఆమె సనత్‌నగర్ యూపీహెచ్‌సీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతి బుధవారం చిన్నారులకు యూపీహెచ్‌సీల్లో అందించే టీకాలను వేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ సౌమ్య, బీఆర్‌ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, నాయకులు పురుషోత్తం, రుక్మిణి రెడ్డి, ఏఎస్ఎంలు, ఆశవర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బజాజ్ ఎలక్ట్రానిక్స్ బంపర్ డ్రా

సాక్షి, సిటీబ్యూరో: బజాజ్ ఎలక్ట్రానిక్స్ గ్రాండ్ బంపర్ డ్రా కార్యక్రమాన్ని బుధవారం కేపీహెచ్‌బీలోని నెక్సస్‌మాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సినీనటుడు కిరణ్ అబ్బవరం, నటి సిమ్రాన్ చౌదరి పాల్గొని లక్కీ డ్రా తీశారు. కూపన్ నం.22092303809 వినియోగదారుడికి రూ.50లక్షల క్యాష్ ప్రైజ్ దక్కిందని బజాజ్ ఎలక్ట్రానిక్స్ జీఎం హబీబ్ తెలిపారు. అదే విధంగా 40 ఆల్టో కార్లను తమ వినియోగదారులు గెలుచుకున్నారని పేర్కొన్నారు.



రూ.50లక్షల లక్కీ డ్రా కూపన్ చూపిస్తున్న నటుడు కిరణ్ అబ్బవరం, నటి సిమ్రాన్ చౌదరి

దశలవారీగా సీసీ రోడ్ల నిర్మాణం

సనత్‌నగర్: అన్ని కాలనీలు, బస్తీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించి దశలవారీగా పనులు చేపట్టడం జరుగుతుందని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి అన్నారు. డివిజన్ పరిధిలోని శ్యాంలాల్ బిల్డింగ్స్ ప్రాంతంలో గల భగత్‌సింగ్‌నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుల సహకారంతో డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీహరి, సురేష్‌యాదవ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడి మృతి

అమీర్‌పేట: ద్విచక్ర వాహనం ఢీకొని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా అమరావతికి చెందిన ఎస్.గోపికృష్ణ(27) ఎంబీఏ పూర్తి చేశాడు. ఉద్యోగం కోసం గతేడాది నవంబర్ మాసంలో నగరానికి వచ్చాడు. ఎస్ఆర్‌నగర్‌లో హాస్టల్‌లో ఉంటున్న కృష్ణ ఈ నెల 1న రాత్రి 8.30 గంటల సమయంలో స్నేహితుడు మణికంఠతో కలిసి ఉమేష్ చంద్ర విగ్రహం వద్ద నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా పల్సర్ వాహనం ఢీకొట్టింది. తల పగిలి తీవ్ర గాయాలకు గురైన కృష్ణను అమీర్‌పేటలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తల్లి శ్రీదేవి, సాంబశివరావు దంపతులకు గోపికృష్ణ ఏకైక సంతానం. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కుత్బుల్లాపూర్‌లో కాషాయ జెండా ఎగరేయాలి

కుత్బుల్లాపూర్: బీజేపీలో కష్టపడి పని చేసేవారికి పదవులు వస్తాయని... అదే ఇతర పార్టీలో కాలు మొక్కితేనే వస్తాయని.. పాతా కొత్త తేడా లేకుండా అందరు సమష్టిగా పనిచేసి కుత్బుల్లాపూర్‌లో కాషాయ జెండా ఎగరేయాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. గాజులరామారంలోని చిత్తారమ్మ ఆలయ ప్రాంగణంలో బుధవారం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చి రెడ్డి, జాయింట్ కన్వీనర్ రాముగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన బీజేపీ నియోజకవర్గస్థాయి సమావేశానికి అసెంబ్లీ పాలక్ డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

- జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో ఈనెల 7వ తేదీన జరిగే బూత్ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలన్నారు. పార్టీని బూత్ స్థాయిలో పటిష్టం చేసినపుడే పార్టీ గెలుపు సాధ్యమవుతుందన్నారు.

కూన శ్రీశైలంగౌడ్‌తో భేటీ

- అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌తో షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో అరుణ భేటీ అయ్యారు. కుత్బుల్లాపూర్‌లో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాల గురించి ఈ సందర్భంగా చర్చించారు. కుత్బుల్లాపూర్ పాలక్‌గా నియమితులైన సందర్భంగా డీకే అరుణను శ్రీశైలంగౌడ్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.
- ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అర్బన్, రూరల్ అధ్యక్షులు పన్నాల హరీష్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డా. ఎస్.మల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు ముగ జయశ్రీ, కొల్లు మాధవి, వివిధ మోర్చాల నాయకులు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, డివిజన్ పదాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న డీకే అరుణ

డివిజన్లలో జేఈ వ్యాక్సినేషన్ షురూ



- మెదడువాపు రాకుండా 9–18నెలల పిల్లలకు వ్యాక్సిన్
- వ్యాక్సిన్ వేయించాలని తల్లిదండ్రులను కోరిన కార్పొరేటర్లు
- ఈ వ్యాక్సిన్ పూర్తిగా ఉచితమని వెల్లడి



ఆల్విన్‌కాలనీ ఫేజ్–2 కమ్యూనిటీహాల్, రాజీవ్‌గాంధీనగర్ బస్తీ దవాఖానాలో వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, సబిహాబేగం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్–2 కమ్యూనిటీహాల్‌లో బుధవారం మెదడువాపు రాకుండా 9 నుంచి 18 నెలల పిల్లలకు అందిస్తున్న జేఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో మాత్రమే అందుబాటులో ఉన్న ఈ వ్యాక్సిన్‌ను బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. డివిజన్‌లోని ప్రజలు తమ పిల్లలకు జేఈ వ్యాక్సిన్ వేయించాలని కోరారు. డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ.. ఆల్విన్‌కాలనీ కమ్యూనిటీహాల్‌లో ప్రతి బుధవారం, శనివారం వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, కట్టా శ్రీనివాస్‌రావు, అగ్రవాసు, వాలి నాగేశ్వరరావు, సంతోష్, ఉమేష్, శ్రీను, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీనగర్ బస్తీ దవాఖానాలో...

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్‌లో ఉన్న బస్తీ దవాఖానాలో చేపట్టిన జేఈ వ్యాక్సినేషన్ ప్రక్రియను బుధవారం కార్పొరేటర్ సబిహా బేగం పరిశీలించారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మొదటగా రాజీవ్‌గాంధీనగర్‌లోని బస్తీ దవాఖానాలో ప్రారంభించామని ఆమె తెలిపారు. డివిజన్‌లో 9 నెలలు నిండిన ప్రతి బిడ్డకు ఈ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. సిబ్బంది చిన్నారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వ్యాక్సిన్ వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఫు, సలాఉద్దీన్, దుర్గ, షమ, జ్ఞానేశ్వర్, యోగిరాజ్ తదితరులు పాల్గొన్నారు.